క్లుప్తంగా

చేనుకు చెంగావి చీర!



వరి పంటకు రక్షణగా కట్టిన రంగురంగుల చీరలు

రాచర్ల: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలను దిగుబడి చేతికి వచ్చే దశలో అడవి పందులు నాశనం చేస్తున్నాయి. వరి, పత్తి, జొన్న పంట పొలాలను దెబ్బతీస్తున్న అడవి పందులను కట్టడి చేయడం రైతులకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే రైతులు వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నారు. పంటలను సంరక్షించుకునేందుకు చీరలను రక్షణ కవచంగా మార్చుకుంటున్నారు. రంగుల చీరలను చూస్తే అడవి పందులు అటువైపు వచ్చేందుకు సాహసించవని రైతులు చెబుతున్నారు. మరికొందరు రైతులు వరి, పత్తి పంటల చుట్టూ సోలార్ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం చినారికట్ల జంక్షన్ సమీపంలో 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు వర్చువల్ పద్ధతిలో సీఎం చంద్రబాబునాయుడు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల తదితరులు హాజరయ్యారు. రూ.33 కోట్లతో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌తో రైతులకు, గృహ వినియోగదారులకు మేలు చేకూరుతుందని చెప్పారు. కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, దర్శి ఈఈ శ్రీనివాసరావు, స్థానిక ఏఈ వీరబ్రహ్మం, స్థానిక తహసీల్దార్ సురేష్, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, మండల టీడీపీ కన్వీనర్ మోరబోయిన బాబురావు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా గడ్డి కోత యంత్రాలు



రైతులకు అందిస్తున్న గడ్డి కోత యంత్రం

పొదిలి రూరల్: పశువులకు అవసరమైన గ్రాసాన్ని ముక్కలుగా చేసి అందించే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని ఉన్నగురువాయపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ తెలిపారు. కృపా ఇండ్రీస్ట్రీస్‌కు చెందిన పవర్ ఆపరేటెడ్ శాఫ్ కట్టర్ 2 హెచ్‌పీ యంత్రం రూ.33,970 కాగా 40 శాతం సబ్సిడీ పోను రైతులు రూ.20,382 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. యంత్రాలు అవసరమైన వారు పశు వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన



చినారికట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొనకనమిట్ల: గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం పలు గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చినారికట్ల, పాతపాడు, సిద్ధవరం, చినమనగుండం, నాగంపల్లి గ్రామాల్లో సర్వే చేపట్టి క్యాన్సర్ లక్షణాల గురించి వివరించారు. అనుమానితులు ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నారాయణరెడ్డి, ఎంపీహెచ్ఎస్ జె.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూళ్లలో పరీక్షల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ శామ్యూల్

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో సెల్ఫ్ అసెస్మెంట్-2 పరీక్షలను మార్కాపురం డీవైఈఓ శామ్యూల్ గురువారం తనిఖీ చేశారు. రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరుకావాలని, పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. హిందీలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డి, హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుద్యోగుల భృతిపై దెబ్బ!



షాపింగ్ మాల్ వద్ద ధర్నా చేస్తున్న మహిళా ఉద్యోగులు



అన్నా రాంబాబుతో మాట్లాడుతున్న ప్రజలు

- మార్కాపురంలో ఆక్రమణల తొలగింపు పేరుతో పాలకుల అరాచకం
- మార్కింగ్ చేసిన ప్రదేశాన్ని దాటి భవనాలు ధ్వంసం
- తమ పొట్ట కొడితే ఎలా బతకాలంటూ లక్కీ షాపింగ్ మాల్ ఉద్యోగుల ధర్నా

మార్కాపురం రూరల్:

మున్సిపల్ అధికారులు ఆక్రమణ తొలగింపు పేరుతో చేపట్టిన కూల్చివేతల ప్రక్రియ ఉద్రిక్తతకు దారి తీసింది. మార్కాపురం పట్టణంలోని లక్కీ షాపింగ్‌మాల్‌ను గురువారం ఉదయం కూల్చడంతో సుమారు 350 మంది ఉద్యోగులం రోడ్డునపడ్డామని తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. తాము ఆక్రమణల తొలగింపునకు వ్యతిరేకం కాదని, అయితే 15 రోజుల క్రితం మార్కింగు ఇచ్చిన ప్రదేశాన్ని దాటి మాల్‌ను కూలచ్చడంలో ఆంతర్యం ఏమిటని ఉద్యోగులు నిలదీశారు. ఇప్పట్లో మాల్ తెరిచే అవకాశం లేకపోవడంతో అందులో పనిచేస్తున్న తాము జీవనం కోల్పోయామని రోదించారు. అందరూ కలిసి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ అధికారులు ఏకపక్షంగా, అడ్డదిడ్డంగా షాపింగ్ మాల్‌ను కూల్చడంతో తమ ఉద్యోగాలు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కింగ్ చేసిన వరకు కూల్చితే ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదన్నారు. విద్యుత్ వైర్లు, షట్టర్లు తొలగిస్తూ అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం జేసీబీతో కూల్చడాన్ని తప్పుబట్టారు. షాపింగ్ మాల్ మళ్లీ తెరుచుకోవాలంటే నెలల సమయం పడుతుందన్నారు. అప్పటి వరకు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. మాల్‌లో పనిచేసే పలువురు ఉద్యోగులు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అహరోన్, రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఉద్యోగులతో చర్చించారు. కొంత సమయం తర్వాత ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పరిశీలన

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భవనాలను మున్సిపల్ అధికారులు కూల్చివేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు రీడింగ్ రూమ్ సెంటర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఆయన వద్దకు వచ్చి మొరపెట్టుకున్నారు.

మా కుటుంబానికి ఆధారమెలా?



మార్కాపురం పట్టణ శివార్లలో నివాసముంటూ సుమారు 350 మంది వరకు లక్కీ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నాం. అనూహ్యంగా షాపింగ్ మాల్ ముందు భాగం కూల్చివేయడంతో ఇప్పట్లో మాల్ తెరుచుకునే పరిస్థితి కనిపించడం లేదు. రెక్కాడితేగానీ డొక్కాడని మా జీవితాల్లో ఉద్దేశపూర్వక ఆక్రమణల తొలగింపు పిడుగులా మారింది. మార్కింగ్ చేసిన వరకు కూలిస్తే అభ్యంతరం లేదు. ఇప్పుడు మా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి.

– మేరీ, మహిళా ఉద్యోగి

పక్కాగా డాక్యుమెంట్లు ఉన్నా కూల్చారు



మార్కాపురం పట్టణంలోని కళాశాల రోడ్డులో నాకు చెందిన స్థలంలో షాపు ఏర్పాటు చేసుకున్నా. ఆ స్థలానికి సంబంధించి పూర్తి డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నాయి. వాటిని అధికారులకు చూపిస్తున్నా పట్టించుకోకుండా కూల్చివేశారు.

– గొలమారి కృష్ణారెడ్డి

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ, పక్కన సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లో రెవిన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఆడిట్ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. గురువారం మార్కాపురంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన అనంతరం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గ్రీవెన్స్‌లో ఇచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని, అర్జీదారులతో మాట్లాడి సమస్య పరిష్కారంపై స్పష్టత ఇవ్వాలని తహసీల్దార్లకు దిశా నిర్దేశం చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణకు ఆడిట్ బృందాన్ని ఏర్పాటు చేశామని, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి బాధ్యత వహిస్తున్నారని తెలిపారు. భూ సేకరణ, అటవీ భూముల సమస్య, పౌర సరఫరాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి అధికారులకు పలు సూచనలిచ్చినట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 4.80 లక్షల గ్యాస్‌కనెక్షన్లు యాక్టివ్‌గా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,05,925 మంది లబ్ధిదారులు గ్యాస్ బుక్‌చేసుకోగా 65,960 మందికి గ్యాస్ డెలివరీ చేశామని, 32,398 మంది ఖాతాల్లో రూ.2.62 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. ఉచిత గ్యాస్ డెలివరీ విషయంలో ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1967, 80089 01457కు ఫోన్ చేయాలని సూచించారు. ఈకేవైసీ కోసం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, గ్యాస్ డెలివరీ బాయ్‌లు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు ఉచితంగా ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

ఉపాధి హామీ పనులపై ఏపీడీ విచారణ



విచారణ నిర్వహిస్తున్న ఏపీడీ

అర్ధవీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని చూస్తోందని, అందులో భాగంగా ఏపీఓ కె.శ్రీనివాసరెడ్డి తమను వేధిస్తున్నారని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం ఏపీడీ భాస్కర్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. తమకు నాలుగు నెలలుగా వేతనం ఇవ్వకుండా రాజీనామా చేయాలని బలవంతం చేస్తున్నారంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం ఏపీడీ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు తమ సమస్యలను వివరించారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లతో సంబంధం లేకుండా టీఏలు, ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్ బయట వ్యక్తులతో మస్టర్ వేయిస్తూ బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. రాజీనామా చేయాలంటూ ఏపీఓ చెప్పిన వాయిస్ రికార్డులను సైతం విచారణాధికారికి వినిపించారు. ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు తప్పుడు బిల్లులు పెట్టి దోచుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఏపీడీ చెప్పారు.

సామాజిక తనిఖీలో సమన్వయంతో పని చేయాలి

- డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరాణి

పొదిలి రూరల్: మహత్మాగాంధీ జాతీయ ఉపాధీ హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ చేసేటప్పుడు సోషల్ ఆడిట్ బృందాలు, ఉపాధి హామీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డ్వామా విజిలెన్స్ అధికారి పి.ఝాన్సీరాణి సూచించారు. గురువారం పొదిలి మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీపై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల పూర్తి రికార్డులు సోషల్ ఆడిట్ బృందానికి ఇవ్వాలన్నారు. సామాజిక తనిఖీలో పారదర్శకత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ టి.వెంకటరావు, ఈసీ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఈఓ వారణాసి గరిధర్‌శర్మ



కొనకనమిట్లలో మాట్లాడుతున్న ఎంఈఓ



పొదిలిలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులురెడ్డి

రాచర్ల: స్వయం సహాయక సంఘాల్లో మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమని ఎంఈవో వారణాసి గిరిధర్ శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీవోఏలు, వలంటరీ టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 665 మంది మహిళలను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు. మండలంలోని కాలువపల్లె, చినగానిపల్లె, యడవల్లి, సోమిదేవిపల్లె గ్రామాల్లో వలంటరీ టీచర్లతో అక్షరాస్యత కేంద్రాలను నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వయోజన విద్య పర్యవేక్షులు వై.చౌడిరెడ్డి, ఎంఈఓ-1 శివకోటేశ్వరరావు, ఏపీఎం రమేష్ బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజార్ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా చేసేందుకు ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ డాంగే షరీఫ్, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ చెన్నారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం సుధాకర్ పర్యవేక్షణలో ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మహిళలకు చదువు చెప్పేందుకు పదిమందికి ఒక వలంటీర్ టీచర్‌ను నియమించి రాత్రి పూట మహిళలకు విద్య నేర్పనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీసీ సాయి, వీఓఏలు, వలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: స్వయం సహాయక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యమని ఎంఈఓ ఎం.శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక వెలుగు ఆఫీసులో గురువారం మొదట విడతగా పొదిలి మండలంలోని అక్కచెరువు, అన్నవరం, మాదాలవారిపాలెం, నందిపాలెం, కంబాలపాడు గ్రామాల మహిళలకు ఉల్లాస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ఉల్లాస్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలన్నారు. మహిళలు చదువుకుంటే కుటుంబం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ చెన్నారెడ్డి, ఏపీఎం గోపాలకృష్ణ, సీసీలు రాజయ్య,వెంకటరెడ్డి, అకౌంటెంట్ శ్రీదేవి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్వయం సహాయం సంఘాల మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ఉద్దేశమని ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఓలు, వలంటరీ టీచర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని అంబవరం, క్రిష్ణంశెట్టిపల్లె, వెల్లుపల్లె, జయరాంపురం, గడికోట, సంజీవరాయుడుపేట గ్రామాలల్లో వలంటరీ టీచర్లతో అక్షరాస్యత కేంద్రాలు నిర్వహిస్తున్నామని వయోజన విద్య పర్యవేక్షకులు వై.చౌడిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం నరేష్, మహిళలు పాల్గొన్నారు.

పొదిలి: మహిళలను అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ చెన్నారెడ్డి చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహిళలను అక్షరాస్యులుగా చేస్తే సమాజం బాగుపడుతుందని చెప్పారు. మొదటి విడతగా అక్కచెరువు, అన్నవరం, మాదాలవారిపాలెం, ఆముదాలపల్లి, కంభాలపాడు, నందిపాలెం గ్రామాల్లో నిరక్షరాస్యులకు విద్య నేర్పనున్నట్లు ఏపీఎం గోపాలకృష్ణ చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, సీసీలు రాజయ్య, వెంకటరెడ్డి, శ్రీదేవి, వీఓఏలు, వలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి



సీవీ రామన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాలేజీ సిబ్బంది

మార్కాపురం: మార్కాపురంలోని డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో సర్ సీవీ రామన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు మాట్లాడుతూ.. భౌతిక శాస్త్రంలో తొలి నోబెల్ పురస్కారం అందుకున్న సీవీ రామన్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని సూచించారు. మాజీ మంత్రి కళాశాల టెక్నికల్ అడ్వయిజర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్, కార్యదర్శి ఆదిమూలపు విశాల్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ మస్తానయ్య, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

పొదిలి: స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపు నిర్వాహకులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదిలి అడ్డరోడ్డు దగ్గర అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన గంగారావును అరెస్ట్ చేసి ఆరు క్వార్టర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మర్రిపూడి మండలం చిలంకూరు గ్రామంలో కోటయ్య అనే వ్యక్తి నుంచి 20 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న విష్ణుప్రియ



మార్కాపురం : మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఏఓ జక్కం మెర్సీ



మూగచింతలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

గిద్దలూరు రూరల్: మిరప పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ సూచించారు. మండలంలోని వెల్లుపల్లె, వెంగల్‌రెడ్డిపల్లె గ్రామాల పరిధిలో మిరప, బొప్పాయి పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. మిరపలో తామరపురుగు, తెల్లదోమ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పురుగుల నివారణకు ఎకరాకు 40 నీలం రంగు అట్టలు ఏర్పాటు చేయాలన్నారు. బొప్పాయి పంటలో పిండినల్లి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారిపేట: పొగాకు సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ సూచించారు. గురువారం జేసీ అగ్రహారం, ఎంపీ చెరువు గ్రామాల్లో పొగాకు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మినుములు, రాగి, కొర్రలు, జొన్నలు సాగు చేసుకోవడం వల్ల ఖర్చు తగ్గడంతోపాటు మంచి లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మెట్ల బాలకృష్ణ, బాలేశ్వరయ్య, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ, రామచంద్రాపురం, కోలభీమునిపాడు, జమ్మనపల్లి గ్రామాల్లో మార్కాపురం ఏడీఏ బాలాజీ నాయక్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ.. పొగాకు పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము, కంది, పెసర, అలసంద తదితర పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ శైలజ, గజ్జలకొండ, రామచంద్రాపురం, కోలభీమునిపాడు, జమ్మనపల్లి వీఏఏలు నవీన్ కుమార్, ఖైరూన్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

పొదిలి రూరల్: రైతులు పొగాకు ప్రత్యామన్నాయ పంటలైన బొబ్బర, శనగ, మినుము, జొన్న పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి ఎస్‌కే జైనులాబ్దిన్ సూచించారు. గురువారం పొదిలి మండలంలోని కొండాయపాలెం, మూగచింతలలో గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. పొగాకు ధరలు స్థిరంగా ఉండకపోవడం వల్ల రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రబీ 2024-25 సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సంధ్య, గురుబ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఉప విద్యాశాఖాధికారి

కంభం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి బి.శామ్యూల్ జాన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేసారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో ఎంఈఓ శర్వాణి, సీఆర్పీ మురళి తదితరులు పాల్గొన్నారు.

వేములపాడులో కొండచిలువ కలకలం



కొండచిలువతో అటవీశాఖ సిబ్బంది

గిద్దలూరు రూరల్: మండలంలోని వేములపాడు గ్రామ సమీపంలో గురువారం ఓ పొగాకు చేలో కొండ చిలువ రైతులను భయభ్రాంతులకు గురిచేసింది. గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి పొలం వద్ద కొండచిలువ కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. కొండచిలువను బంధించిన అటవీశాఖ సిబ్బంది నల్లమల అటవీ ప్రాంతంలో వదిలేశారు.

గోవుల కంటైనర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన కంటైనర్

బేస్తవారిపేట: గోవులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు సీజ్ చేసిన సంఘటన గురువారం రాత్రి బేస్తవారిపేట మండలంలోని చింతలపాలెం సమీపంలో చోటుచేసుకుంది. విజయవాడ నుంచి అనంతపురానికి కంటైనర్‌లో 60 గోవులను తరలిస్తుండగా పోలీసులు తనిఖీల్లో గుర్తించి సీజ్ చేశారు. డ్రైవర్, క్లీనర్‌ను ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.